
# మినీ కథ

## ఇది చేదుకథ కాదు




సైకిలుమీద హుషారుగా యీలపాట పాడుకుంటూ వస్తున్న రాంబాబు చేతులు సడెన్‌గా బ్రేకులమీద బిగుసుకున్నాయి...ఒక్క క్షణం అతని గుండె ఆగి తిరిగి కొట్టుకోవడం ప్రారంభించింది. మామూలుగా కంటే వేగంగా. ఒక అందాల సుందరి వయ్యారంగా నడిచిపోతోంది. ఆమె భుజానికి హేండ్‌బాగ్ వేలాడుతోంది సుతారంగా. చెవులకున్న రింగులు అలవోకగా కదలాడుతున్నాయి. ఆమె వెనకనుండి కూడా అద్భుతంగా అగుపిస్తోంది. బిగించి కట్టిన లోపలిబాడీ పల్చని జాకెట్‌లోంచి స్పష్టాస్పష్టంగా కనిపిస్తూ వయసు పొంగుల్ని తెలియజేస్తోంది. ఆమె నడుస్తుంటే... సన్నని నడుము, ఆ నడుము మీద లలిత లలితంగా నర్తించే నాగుబాములాంటి నల్లని జడ... లయబద్ధంగా కదలాడే పిరుదులు...ఆ పిరుదులపై మృదంగం వాయించే జడకుచ్చులు... హృదయస్పందనను, రక్తప్రసరణ వేగాన్ని ఎక్కువ చేస్తున్నాయి.

తలలో మల్లెలు, తెల్లని పాలియస్టర్ చీర, అదేరంగు జాకెట్. దివినుండి దిగివచ్చిన దేవతలా వుందామె మెల్లగా ఆమె ప్రక్కగా సైకిలును పోనిచ్చి బెల్ మోగించాడు. ఆ అమ్మాయి ఒక్కసారి వులిక్కిపడి తన కలువరేకులవంటి కళ్ళు రెపరెపలాడించి అతనివేపు తేరిపార చూసింది. చూసి నవ్వింది...అలా నవ్వినపుడు విచ్చుకున్న పెదవుల్లోంచి మల్లెమొగ్గలవంటి పలువరస తళుక్కుమని మెరిసింది. అతని గుండె మరోసారి ఆగి తిరిగి కొట్టుకోవడం ప్రారంభించింది మరీవేగంగా. రక్తం యింకా వేగంగా, వేడిగా ప్రవహించి నరాలు జివ్వుమన్నాయి. తియ్యగా మూలిగాయి. యిలా గుండె మాటిమాటికి ఆగి కొట్టుకోవడం, రక్తం వేగంగా ప్రవహించడం,నరాలు తియ్యగా మూల్గడం యిదే ప్రథమం రాంబాబుకు. రాంబాబు ఆమెను పలుకరించాలని ప్రయత్నిస్తున్నాడు కానీ...గొంతు అతని స్వాధీనంలో లేదు. గొంతే కాదు అతని అవయవాలు యేవీ అతను చెప్పినట్లు వినమంటున్నాయి.

"మీరు ఎందాకా వెళ్ళాలి...?" అన్నాడతి ప్రయత్నం మీద రాంబాబు.

"నేను రామాపురం వెళ్ళాలండి. రిక్షాలుగానీ, జట్కాలుగానీ వుంటాయనుకున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే..." అంటూ ఆగి అతని కళ్ళలోకి చూసింది.

"నాకు అభ్యంతరమా...అందునా అంత సుందరి...అడిగితే కాదనడమా అది నా అదృష్టంగా భావిస్తున్నా..." ననబోయాడు...కాని ఆ మాటలు అతని మనసులోంచి గొంతువరకు వచ్చి అక్కడ ఆగిపోయాయి.

"సరే...రండి...ముందు కూర్చోండి..." ఆహ్వానించాడు. ఆమె వచ్చి సైకిల్‌పై హేండిల్‌కు సీటుకు మధ్య కూర్చుంది. అలా కూర్చుంటున్నపుడు ఆమె భుజం అతని ఒంటికి తగిలి విద్యుత్తు పుట్టించింది. సైకిలు ముందుకు దూకించాడు రాంబాబు. పూవులా మెత్తగా తగులుతున్న ఆమె ఒళ్ళు, అతనిలో కోర్కెల్ని బుసలు కొట్టిస్తోంది. ఆమె తలలోని మల్లెలు అతని నాశికా పుటాలకు మత్తుగా సోకి, కైపెక్కిస్తున్నాయి. ఆమెచేతులు అతని చేతులపై వేసింది. రాంబాబులో వుత్సాహం పొంగింది.

"మీ పేరు...?"

"నీహారిక..."

ఓహ్! అద్భుతమైన పేరు.

ఆమె ఏమేమో...చెబుతోంది. వీణ మీటుతున్నట్లు...కోయిల కూస్తున్నట్లు. అలా ఎన్నివేల మైళ్ళనా తొక్కాలనిపిస్తోంది రాంబాబుకు. 'రోజూ వెధవ సైకిలు ఎవడు తొక్కుతాడు' అని విసుక్కునే రాంబాబుకు సైకిలుమీద హఠాత్తుగా ప్రేమపుట్టుకొచ్చింది.

ఇంతలో ఏదో స్కూటర్ వస్తున్న శబ్దం. ఆ స్కూటర్ వచ్చి సైకిల్ ప్రక్కగా నెమ్మదిగా నడవసాగింది. రాంబాబు స్కూటర్‌వాలా వేపు గర్వంగా చూశాడు.

"ఏమండీ...మీరెంతవరకు వెళ్తున్నారు?" అంది నీహారిక స్కూటర్‌వాలావేపు మత్తుగా చూస్తూ.

"రామాపురం..." అన్నాడా స్కూటర్‌వాలా. కళ్ళజోడు సవరించుకుంటూ, షోగ్గా. రాంబాబుకు చిరాగ్గావుంది స్కూటర్‌వాలాను చూస్తుంటే.

"ఆపండి..." అని రాంబాబుతో అని సైకిలుదిగి... "మీకు చాలా శ్రమయిచ్చాను. థాంక్సండీ...అని చెప్పి స్కూటర్‌వాలాతో... "ఎక్కనా...?" అంది. స్కూటర్‌వాలా తలవూపడం, ఆమె స్కూటర్ ఎక్కడం,స్కూటర్ ఝూమ్మంటూ ముందుకుసాగిపోవడం ఒకేసారి జరిగిపోయాయి.

స్కూటర్ ఎక్కినపుడు ఆమె రాంబాబు వేపు చూసి నవ్వినవ్వు, ఆ స్కూటర్‌వాలా చూసినచూపులు రాంబాబు గుండెల్ని ముక్కలు చేసి, మొహాన్ని మాడ్చేశాయి.

స్కూటర్‌వాలామీద యీర్ష్య, ఆఅమ్మాయి

### ఇది నిజం

ఒకటో ఎలిజెబెత్ మహారాణి పరిపాలనలో పురుషుల గెడ్డానికిపన్ను విధించబడేది.

# ఇది చేదుకథ కాదు

## మినీ కథ

మీద కోపంతో అతని మనసు మండిపోతోంది...

ఛీ...ఎంత స్వార్థం...అందుకే అన్నాడు తాట్రోలు అల్లసాని "క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్" అని. 'అంగన నమ్మరాదు...'అని యింకెవరో అన్నారు.

రాంబాబు మనసంతా చికాగ్గావుంది. ఆమె బరువును మోస్తున్నపుడు ఎంతో తేలిగ్గా హాయిగా వున్న తనకు, ఆమె దిగిపోయిన తరువాత సైకిలు తొక్కడం ఎంతో బరువుగా అనిపించ సాగింది.

* * *

రాంబాబుకు కన్నుతెరిచినా కన్నుమూసినా నీహారిక రూపమే కనిపిస్తోంది. ఆమె చేసిన ద్రోహం...(అది రాంబాబు దృష్టిలో ద్రోహమే మరి) మరిచిపోలేకపోతున్నాడు. అయినా ఆమెనే ప్రతిక్షణం తల్చుకొంటూ బాధపడిపోతున్నాడు. విరహంతో వేగిపోతున్నాడు. ఆమె 'మరొక్కసారి కనిపిస్తే బాగుండు'ననుకుంటున్నాడు. ఆ స్పర్శ ఆ హాయిని మరిచిపోలేకపోతున్నాడు.

యిలా ఆమెను మరువలేక మరువలేక మరిచిపోతున్న సమయంలో తను ఎప్పటిలాగే స్కూలుకు సైకిలు మీద వెళ్తుంటే ఆ స్కూటర్ వాలా కనిపించాడు. రాంబాబుకు కోపం వచ్చిందతన్ని చూస్తూనే. స్కూటర్‌వాలా రాంబాబుకు దగ్గరగా పోనిచ్చి 'హలో మాష్టారూ' అని పలకరించాడు. తనుకూడా 'హలో' అనేశాడు మర్యాద కోసం.

"మాష్టారూ...! మీరు చాలా అదృష్టవంతులండీ..." అన్నాడు.

"ఏం..." అన్నట్లు చూశాడు రాంబాబు స్కూటర్‌వాలా వేపు...

"నిజం మాష్టారూ ! రహస్యంగా డాక్టర్ దగ్గరకు వెళ్ళి, ఆ డాక్టర్‌చేత చీవాట్లుతిని, సూదుతో పొడిపించుకోవాల్సిన గతి తప్పింది మీకు" అన్నాడు...

"అంటే...!!!"అర్థమయింది రాంబాబుకు.

ఆ స్కూటర్‌వాలాకు మనసులోనే ధన్యవాదాలు చెప్పుకున్నాడు, తనకు బదులుగా అతనా బాధను భరించినందుకు, తప్పిపోయిందనుకున్న (దుర) అదృష్టానికి...సంతోషించాడు.

మళ్ళీ మరోరోజు ఓ సినిమాహాల్ దగ్గర కనిపించి నవ్వింది ఆ అమ్మాయి. ఆ నవ్వు విషబాణంలాసోకి నిలువెల్లా కంపించిపోయిన రాంబాబు మళ్ళీ ఆ విషబాణం తగలకుండా జనంలో కలిసిపోయాడు.

## మొహంచూసి అంతా చెప్పేయొచ్చు

### కళ్ళు

—టి. ఉమా [గతవారం తరువాయి]



విశాల నేత్రాలు: ముక్కుకు సూటిగా ప్రవర్తించేవారనే అభిప్రాయం కలగచేస్తారు. ప్రేమికుల్ని సులభంగా ఆకట్టుకోగలుగుతారు. కానీ ప్రేమ వ్యవహారాల్లో దెబ్బతింటుంటారు.




చిన్నకళ్ళు: క్రమశిక్షణకి లోబడివుండే స్వభావం. ఒక నియమానుసారంగా నడుచుకుంటారు. దృఢమైన నైతికవిలువలు కలిగివుంటారు. సులభంగా జయింపబడరు. కానీ ఒకసారి ఎవరికైనా మనసు ఇస్తే, జీవితాంతం కట్టుబడి, భక్తిశ్రద్ధలతో నడుచుకోగల్గుతారు.



చొచ్చుకువచ్చేకళ్ళు: వ్యసనపరులు. జూద స్వభావం కలిగివుంటారు. కామవాంఛ అధికం. జీవితంలో ఇతరులతోకూడా జూదం ఆడినట్లే ప్రవర్తిస్తూ వుంటారు.



లోతుగావుండే కళ్ళు: కలలుగనే స్వభావం. స్వాభావికంగా శృంగారలోలులు కాకపోయినా, ఆలోచనల్లో శృంగారంపాళ్ళు అధికం. సమ్మకస్తులు. మనసు చాలా సున్నితంగా గాయపరుచుకుంటారు. ఊహలు వాస్తవాలుగా మలుచుకోగలిగితే, మేధావులు కాగలరు.



ఒంపుతిరిగిన కళ్ళు: పైకి ఒంపుతిరిగివుండే నేత్రాలుగల స్త్రీ చలాకీగా, హాస్యప్రియత్వం కలిగివుంటుంది. కాసింత ధైర్యం, కూసింత సాహసం జతకూడి వుంటాయి. అవకాశవాదులు వీరు. ఆత్మవిశ్వాసం కలిగివుంటారు. ఆశాజీవులు. కోపం తొందరగా వచ్చేస్తుంది వీరికి.



క్రిందికి ఒంపుతిరిగిన కళ్ళు: పురుషులకి అణిగిమణిగి వుంటారు. సాధుస్వభావం. సులభంగా బోల్తాపడిపోతారు, అందరినీ నమ్మి. ఇతరుల సమస్యలని అర్థం చేసుకోగలరు స్వయం సమస్యలకి అపరిష్కృతమే.

(వచ్చేవారం ముక్కు)

